# జనపదం
JANAPADHAM


హైదరాబాద్ | గురువారం 08 ఆగస్టు 2024 | తెలుగు దినపత్రిక




## బ్యాడ్ లక్...

- ఒలింపిక్స్ నుంచి ఫొగాట్ ఎలిమినేట్..
- అధిక బరువు నెపంతో అనర్హత వేటు..
- బంగారు ఆశలపై నీళ్లు..
- వీరనారికి దేశం యావత్తు జేజేలు..

**జనపదం, స్పోర్ట్స్:** కళ్ల ముందు స్వర్ణం సాక్షాత్క రించింది. అడుగు దూరంలో బంగారం మెడను ఆవిష్కృతం అవుతుందని పించింది. కానీ నిబం ధనలు నీళ్లు జల్లాయి. వంద గ్రాముల అధిక భా రం అవకాశాన్ని తుడిచిపెట్టింది. పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ లో రెజ్లర్ ఫొగాట్ కు బుధవారం చేదు అనుభవం మిగిలింది. యావత్ దేశం నిర్ఘాతపోయేలా క్రీడల కమిటీ ఆమెను పోటీకి అనర్హురాలిగా ప్రకటించి కలకలం రేపారు. 29 ఏళ్ల వినేష్ 50 కేజీల రెజ్లింగ్ లో ఫైనల్ తలపడాల్సిన కొన్ని గంటల ముందు జరిపిన పరీక్షల్లో కాస్త బరువు ఎక్కువుందనే కారణంతో ఎలిమినేట్ చేసింది. దీంతో పారిస్ లో స్వర్ణ పతకం సాధించాలన్న కలలు కూలిపోయాయి. ఉమెన్స్ రెజ్లింగ్ 50 కేజీల విభాగం నుంచి వినేశ్ ఫొగాట్ అనర్హత వార్తను భారత బృందం పంచుకోవడం విచారకరమని, ఆమె గోప్యతను గౌరవించాలని భారత జట్టు ఒక ప్రకటనలో వేడుకుంటుంది. వీరనారికి యావత్ దేశం జేజేలు పలుకుతోంది. ఎక్స్ వేదికగా ప్రధాని విజేతవు నీవే అని పోస్టు చేసి ధైర్యం కల్పించారు.




# ఢిల్లీ డీల్..?!

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం..?
## హస్తినా వేదికగా పావులు..?

### బెడిసికొట్టిందా... బేరం కుదిరిందా..!

విలీనంలో వాస్తవమెంతో..?

గూటి వారి లీకులా..,

గిట్టని వారి రాతలా..?

రాష్ట్రమంతటా అదే చర్చ..

కొట్టి పారేస్తున్న గులాబీశ్రేణులు..

### మౌనం దాల్చుతున్న కమలం నేతలు..

**పువ్వులు రెండు ఏకమవుతాయా..? కమలం, గులాబీ కలిసిపోతున్నాయా..? ఇదంతా కావాలని చేస్తున్నదా.., స్పందన కోసం ఆడుతున్నదా అనేది అప్రస్తుతం. ఏదైతేనేం... గానీ మొన్నటి ఎన్నికల వరకు ఆ పువ్వుల లెక్కలే వేరుండే. బలాలను మాత్రమే లెక్కిస్తూ, బలహీతలను తొక్కేస్తూ ఏదేదో ఊహించుకునె. కానీ ఫలితాల వెల్లడితో రెంటి పరిస్థితి తేలుకుట్టిన దొంగ మాదిరిగానే మారె. తారుమారైన జాతకాలతో రెండు పూలకు రెంటికి చెడ్డ రేవడి అయ్యింది. గత రెండు పర్యాయాలు సాగించినంత సాహసోపేతంగా వెళ్లలేని స్థితిలో కాషాయం ఉండగా, అధికారం దూరమై గులాబీ కామ్ అయింది. అలాంటి పార్టీలు ఇప్పుడు ఏకమవబోతున్నట్టుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గూటిలో వారి పనా.., గిట్టని వారి కసోగానీ హస్తినా వేదికగా బీజేపీలో బీఆర్ ఎస్ మెర్జ్ కాబోతోందని ప్రచారం సాగుతోంది. నిజమో.., అబద్ధామేనోగానీ ఇదే విషయమై బీఆర్ ఎస్ శ్రేణులు మండిపడుతుండగా.., బీజేపీ ముఖ్యులు మౌనం వహిస్తున్నారు. ఏదిఏమైనా ఆ రవి వదిలిన బాణం నిజంగా గుచ్చుకుంటుందా.., మధ్యలోనే గురి తప్పుతుందా.. అనే విషయమై క్లారిటీని కాలమే తేల్చాలి.**

**జనపదం, న్యూఢిల్లీ:** భారత రాష్ట్ర సమితి నేతల ఇటీవల వరుస ఢిల్లీ పర్యటనలు రివర్స్ కొడుతున్నాయి. మరో నాలుగు రోజులు ఢిల్లీలోనే ఉండి తెలంగాణ పాలిటిక్స్ లో వేడి పుట్టిద్దామనుకున్న లీడర్ల ప్లాన్లు బెడిసికొట్టినట్టే కనిపిస్తున్నాయి. తాజాగా బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని, అదీ ఢిల్లీ ఎన్నికల తర్వాత జరుగొచ్చని ఈ పాటికే చర్చలు ముగిశాయని, బీఆర్ఎస్ పార్టీ ఇక చరిత్రకే పరిమితం కాబోతుందని ప్రముఖ జర్నలిస్ట్ రవిప్రకాశ్ విడుదల చేసిన ఒక వీడియో పొలిటికల్ సర్కిల్స్ లో హీట్ చక్కర్లు కొడుతున్నది. ఢిల్లీలో డీల్ కుదిరిందట కదా...అనే చర్చ పార్టీలో విస్తృతంగా నడుస్తున్నది. దీంతో దెబ్బకు ఢిల్లీ ఖాళీ చేసి తెలంగాణ భవన్ కొచ్చి వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి పార్టీ నేతల్లో నెలకొంది. నాలుగైదు రోజులు పార్టీ ఎమ్మెల్యేలతో ఢిల్లీలో మకాం వేసి రహస్య భేటీలు జరుపుతున్న లీడర్ల కదలికలను పసిగట్టిన ఎమ్మెల్యేలే ఆ జర్నలిస్ట్ కు లీకిచ్చి వార్తలు రాయించారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఎప్పట్నుంచో కసి కోపంతో రగిలిపోతున్న సదరు జర్నలిస్ట్ సమయం సందర్భం చూసి బాంబు లాంటి వార్త విసిరాడు. దీంతో బీఆర్ఎస్ నాయకత్వం అంతా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిజానికి లిక్కర్ కేసులో జైలు జీవితం గడుపుతున్న ఎమ్మెల్సీ కవిత ములాఖాత్ కోసం, బెయిల్ కోసం నేతలంతా ఢిల్లీ వెళ్లారు. అంతకుముందే ఢిల్లీ సీనియర్ న్యాయకోవిదులతో కేసీఆర్ తన ఫాం హౌజ్ లో చర్చలు జరిపారు. అటు కవిత బెయిల్, ఇటు ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు అనుభవజ్ఞులైన న్యాయ నిపుణులతో మంతనాలు సాగించారు. అయితే తాజాగా ఇప్పట్లో బెయిల్ లభించదని, బెయిల్ పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. అయితే ఎమ్మెల్యేల (తరువాయి 2లో)



## అభివృద్ధికి సహకరించండి..

- ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాను కోరిన సీఎం
- పెట్టుబడులే టార్గెట్‌గా రేవంత్ రెడ్డి టీమ్ పర్యటన..
- ఫార్మా గ్లాస్ ట్యూబ్‌ల తయారీ కేంద్రం ఏర్పాటుకు రెడీ

3

## గిరిజనులకు పోడు పట్టాలు

- ఇందిరమ్మ ఇళ్లకూ ముహూర్తం..
- త్వరలోనే బంగాళాఖాతంలోకి ధరణి
- పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీ అమలు
- పిప్రి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## గనులు.. సిరులు..


- దేశ ఆర్థిక వ్యవస్థలో అవే ప్రధానం..
- ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ పాత్ర మరువలేనిది
- మైనింగ్ రంగం అభివృద్ధికి చర్యలు
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- ముందుకెళ్తున్న సంస్థలకు 5 స్టార్ రేటింగ్స్ ప్రదానం

3

## బీమా పై భారమొద్దు..

- ఇన్సూరెన్స్‌లపై జీఎస్టీ ఎత్తేయాలి..
- కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన విపక్షాలు..

2




# గుడ్డెద్దు చేల్లో పడ్డట్టే..!

## ఎంబీబీఎస్ జీవోపై గందరగోళం...

- విద్యార్థుల జీవితాలతో ఆటలా..?
- తమిళనాడు తరహా రూల్స్ పెట్టండి..
- సర్కార్ తీరు సరిగా లేదు..
- మాజీ మంత్రి హరీష్ రావు
- తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం..
- ప్రభుత్వ పెద్దలకు ఏ విషయంపై స్పష్టత లేదని మండిపాటు..

**జనపదం, హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వ తీరు గుడ్డెద్దు చేనులో పడ్డట్టుంది., ఏ అంశంపైనా స్పష్టత లేదు., విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచన అంతకన్నా లేదని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ కు ఓ ప్రణాళిక, పద్ధతి లేదన్నారు. మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ మన విద్యార్థులకు నష్టం చేసేదిగా ఉందని, తెలంగాణ లోనే తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం రాకముందు స్థానికులకు 60 ,70 శాతం ఉద్యోగాలు 40 , 30 శాతం రిజర్వేషన్లు ఉండేవని, కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రపతి ఉత్తర్వులు సవరింప జేసి 2018 లో జీవో 124 ద్వారా స్థానికులకు 95 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని గుర్తు చేశారు.

**సీట్లు పెంచిన ఘనత కేసీఆర్ దే..**

తెలంగాణ వచ్చేనాటికి 2850 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవని, కేసీఆర్ చొరవతో అవి 9 వేలకు పెరిగాయని ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. తెలంగాణ పిల్లలు డాక్టర్లు కావాలనే తపనతో ఈ పనిచేశామన్నారు. 24 ప్రైవేట్ కళాశాలల్లో బీ కేటగిరీ లో తెలంగాణ పిల్లలకు 1072 సీట్లు వచ్చాయని, రాష్ట్రం రాకముందు ఉన్న నాన్ లోకల్ రిజర్వేషన్ ముఖ్యంగా ఏపీ వారికి 15 శాతం పదేళ్ల పాటు కొనసాగించామని 2024 జూన్ 2 వరకు అది కొనసాగిందన్నారు. ఉద్యోగాల విషయం లో 95 శాతం రిజర్వేషన్ల పై ఆంక్షలు లేనందున 2017 లో జీవో తెచ్చామని, అడ్మిషన్లలో (తరువాయి 3లో)



## ఎక్కడ చెడింది బ్రో...

24 గంటల టైం ఇస్తున్నా...

లేదంటే లీగల్ యాక్షన్నే..

మాజీ మంత్రి కేటీఆర్

తప్పుడు కథనమని తీవ్ర ఆగ్రహం..

2



# ఇన్సూరెన్స్ లపై జీఎస్టీని రద్దు చేయాలి..

- కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన విపక్షాలు..
- తనదైన శైలిలో సమాధానమిచ్చిన సీతారామన్
- ఆర్థిక బిల్లుపై లోక్ సభలో చర్చ



**జనపదం, ఢిల్లీ:** లోక్‌సభలో బుధవారం ఆర్థిక బిల్లుపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా చర్చలో పాల్గొన్న పలువురు ప్రతిపక్ష సభ్యులు ఆరోగ్య బీమా, జీవిత బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విపక్షాలకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం జీఎస్టీని ప్రవేశపెట్టడానికి ముందే పన్ను ఉందని ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. ఇది కొత్త అంశం కాదని, ఇంతకు ముందు కూడా ప్రతి రాష్ట్రంలో వైద్య బీమాపై పన్ను ఉండేదని తెలిపారు. అంతేకాదు పన్ను తొలగించాలని మీ రాష్ట్రంలో సీఎంలకు చెప్పారా? జీఎస్టీ కౌన్సిల్‌లో ఉన్న మీ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాశారా అని నిర్మలా సీతారామన్ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ఈ విషయంలో విపక్షాలు ద్వంద్వ ప్రమాణాలు అవలంబిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారని, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు రాష్ట్ర ఆర్థిక మంత్రి ఎదుటే నిరసనకు దిగాలని ఆమె అన్నారు. ఆరోగ్య బీమాపై 18 శాతం జీఎస్‌టీ ఉంది. ఇందులో తొమ్మిది శాతం రాష్ట్రాలకే అందుతుంది. తర్వాత కేంద్రానికి ఏది వచ్చినా అందులో కొంత భాగం రాష్ట్రాలకు కూడా వెళ్తుందని గుర్తు చేశారు. అంటే రూ.100లో రూ.74 రాష్ట్రాలకే అందుతుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

### మధ్యతరగతి ప్రజలకు లాభం..

మోదీ ప్రభుత్వ బడ్జెట్‌లో వివిధ పన్నుల ప్రతిపాదనల వల్ల మధ్యతరగతి ప్రజలు లాభపడ్డారని ఆర్థిక మంత్రి అన్నారు. వివాహ్ సే విశ్వాస్ పథకం కింద పెండింగ్ కేసులు, డిమాండ్లను పరిష్కరించారు. ఇది మధ్యతరగతి, చిన్న వ్యాపారులకు సహాయం చేసిందన్నారు. గత సంవత్సరం 2023లో వ్యక్తిగత ఆదాయపు పన్ను స్లాబ్ గణనీయంగా సరళీకృతం చేయబడింది. పన్ను చెల్లింపుదారులందరి పన్ను బాధ్యత రూ.37,500 తగ్గింది. ఈ ప్రభుత్వం కొత్త వ్యవస్థలో పన్ను స్లాబ్‌ను మళ్లీ సవరించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ బడ్జెట్‌లో కొత్త విధానంలో వేతన ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా రూ.50,000 నుంచి రూ.75,000కి పెంచారు. దీని ద్వారా జీతం పొందే ఉద్యోగికి రూ. 17,500 వరకు ఉపశమనం లభిస్తుందని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఈ ఏడాది ఆదాయపు పన్ను రిటర్నుల సంఖ్య పెరగడాన్ని కూడా ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. ఈసారి 58.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు మొదటిసారిగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారని పేర్కొన్నారు. పన్నుల దాఖలు పెరుగుతున్న ఆధారానికి ఇదే నిదర్శనమని సీతారామన్ అన్నారు.

# గిరిజనులకు పోడు పట్టాలు

- ఇందిరమ్మ ఇళ్లకూ ముహూర్తం..
- త్వరలోనే బంగాళా ఖాతంలోకి ధరణి
- పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీ అమలు
- పిప్రి సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**జనపదం, ఆదిలాబాద్ :** ఇందిరమ్మ రాజ్యంలో పోడు భూములకు పట్టాలిస్తాం, చేతులు పట్టుకొని మీ భూములు దున్నిస్తాం.. రుణాలు సైతం ఇస్తాం... ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా పిప్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. భూ పోరాటాల ద్వారా సంక్రమించిన భూములపై హక్కులు పొందేందుకు ప్రజల మధ్య చర్చ జరగాలని, అసెంబ్లీ లోను చర్చ జరిపిస్తామన్నారు. అందరి ఆమోదంతో సమగ్ర భూ చట్టం తెస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఏఐసిసి ఆదేశం మేరకు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర చేశానని, సీఎల్పీ నేతగా నేను ఓవైపు.. నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మరోవైపు ఆదిలాబాద్ నుంచే యాత్రలు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు.

### ప్రజల సహకారం మరువలేనిది..

మండుటెండల్లో ప్రారంభించిన తన పాదయాత్ర రెండు రోజులు లేదంటే రెండు గ్రామాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారని, కానీ ప్రజల సమస్యలు వింటూ 1365 కిలోమీటర్ల యాత్ర పూర్తి చేశానన్నారు. ఆ పాదయాత్రలో ప్రజల గుండె చప్పుడు విన్నామని, ప్రజలు చెప్పిన సమస్యల పరిష్కారం కోసం కంకణబద్ధులమై ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి అంది వచ్చిన అవకాశాన్ని అనుభవించకుండా అధికారం ఒక బాధ్యత నడుచుకుంటున్నామని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏ హామీని మర్చిపోకుండా అమలు చేస్తున్నామని, ప్రమాణ స్వీకారం చేసిన రోజే మహిళలు మహారాణులుగా చూసుకునేందుకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభించామన్నారు. పెరిగిన వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకొని రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, ఆ తర్వాత కొద్ది రోజులకే రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి హామీలు అమలులోకి తెచ్చామన్నారు. మొదటి సంవత్సరంలోనే ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఐదు లక్షల రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలు జత చేసి ఇస్తున్నామని, ఇది ప్రజల ప్రభుత్వం వచ్చే ప్రతి రూపాయి కూడా దుబారా కాకుండా అర్థవంతంగా ప్రజలకే ఉపయోగపడేలా జాగ్రత్తలు తీసుకుంటామని భట్టి తెలిపారు.

# గుడ్డెద్దు చేల్లో పడ్డట్టే..!

**(మొదటి పేజీ తరువాయి)** సొంత రూల్స్ రూపొందించుకునే మంచి అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చినా పాత పద్ధతి కొనసాగిస్తూ జీఓ 30 తెచ్చారన్నారు. స్థానికత కు తొమ్మిదో తరగతి నుంచి నీట్ ప్రవేశ పరీక్ష కు ముందు దాకా ఏడేళ్లు తెలంగాణ లో చదవాలని నిబంధన అప్పుడు విధించామని, అయితే తొమ్మిదో తరగతి నుంచి నీట్ దాకా నాలుగేళ్లు చదివినా స్థానికత వర్తించేదన్నారు. ఇప్పటి జీవో లో నీట్ కు ముందు నాలుగేళ్లు కచ్చితంగా ఇక్కడ చదివితేనే స్థానికత వర్తిస్తుందనడం దారుణమన్నారు. తమిళనాడు ,కర్ణాటక తో పాటు మిగతా రాష్ట్రాల్లో ఉన్న స్థానికత విధానాలు ఇక్కడ అమలు చేస్తే సరిపోయేదని మాజీ మంత్రి సూచించారు. తమిళనాడులో ఎంబీబీఎస్ సీటు రావాలంటే ఆరు నుంచి పదివరకు అక్కడ చదువుకుని, తల్లిదండ్రులు స్థిర నివాసం కలిగి ఉండాలని, అలాగే కర్నాటక, కేరళలో కూడా వారి వారి నిబంధనలు ఉన్నాయన్నారు.

### అఖిల పక్షం పెడితే సూచనలిస్తాం..

ఇప్పుడు అడ్మిషన్లలో 95 శాతం స్థానికులకే ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆ విషయం పై దృష్టి సారించలేదని, వెంటనే జీవో 33 లో సవరణలు తేవాలని హరీశ్ రావు కోరారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గా పదేళ్ల పాటు ఉన్నందువల్ల పార్లమెంటు చట్టం ప్రకారం బీఆర్ ఎస్ సర్కార్ పాత పద్ధతి కొనసాగించిందన్నారు. పదేళ్ల కాలం ముగిసినా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రపతి పాత ఉత్తర్వులోని మొదటి పారాగ్రాఫ్ ను యథాతథంగా పెట్టి, మిగతా పారాగ్రాఫ్ లు వదిలి పెట్టారన్నారు. ఇప్పటికైనా తెలంగాణకు సొంత రూల్స్ ఉండాల్సిన అవసరం ఉందని, చీఫ్ సెక్రటరీ, ఇతర ఉన్నతాధికారులతో ఒక కమిటీ వేసి మార్గదర్శకాలు రూపొందిస్తే అన్ని విద్యాసంస్థలకు సూచకంగా ఉంటుందన్నారు. ఆయా అంశాలపై అఖిలపక్షాన్ని పిలిస్తే తప్పకుండా హాజరై సూచనలు ఇస్తామన్నారు. అలాకాకుండా ఒంటెత్తుగా వ్యవహరిస్తే పిల్లల జీవితాలు తారుమారవుతాయన్నారు. ఏదిఏమైనా కాంగ్రెస్ పాలన గాలిలో దీపంలా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లు కొత్త ప్రభాకర్ రెడ్డి, మాగంటి గోపినాథ్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ఎస్సార్ యూనివర్సిటీలో ర్యాగింగ్..!

**సీనియర్లు కొట్టారంటూ పోలీసులకు ఫిర్యాదు..**

**జనపదం, హన్మకొండ:** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని అనంతసాగర్ లో ఉన్న ఎస్సార్ యూనివర్సిటీలో ర్యాగింగ్ కలకలం రేగింది. బీబీఏ సెకండ్ఇయర్ చదువుతున్న జాటోతు దిలీప్‌కుమార్ సీనియర్లు తనను ర్యాగింగ్ చేశారంటూ హసన్ పర్తిలో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సీనియర్లు శ్రీకేష్, ఫిరోజ్, మాలిక్, నందన్, ఇంకో పది మంది కలిసి తనపై దాడి చేశారని దిలీప్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బూతులు తిడుతూ.. పిడిగుద్దుల వర్షం కురిపించారని పేర్కొన్నారు. ర్యాగింగ్ కు పాల్పడిన స్టూడెంట్లతో పాటు ఎస్సార్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ఢిల్లీ డీల్..?!

**(మొదటి పేజీ తరువాయి)** ఫిరాయింపుల కేసు హైకోర్టులో కొనసాగుతున్న క్రమంలోనే సుప్రీంకోర్టులో మరో కేసు వేయాలని అదీ తోటి ఎమ్మెల్యేలకు తెలువాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీకెళ్లి బీఆర్ఎస్ నాయకత్వం షో చేసింది. ఉప ఎన్నికలతో రాజకీయ వేడిని పుట్టిస్తున్నామని చెప్పింది. పార్టీ ఫిరాయించిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు ప్రతీ అవకాశాన్ని వాడుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ సహా పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇదే అంశంపై ఢిల్లీలో మకాం వేసి మంతనాలు జరుపుతున్నట్టు భావించారు. అయితే వరుసగా ఢిల్లీలోనే ఉండి కొంత పారదర్శకత, మరికొంత గోప్యతగా ఉండడంతో ఏదో జరుగుతోందని పుకార్లు షికార్లు చేశాయి. పార్లమెంట్ ఎన్నికల ముందు కూడా ఇదే చర్చ తెరపైకి వచ్చింది. బీజేపితో సీక్రెట్ డీల్ అనే వాసన వార్తను ప్రముఖ జర్నలిస్ట్ కు అందడంతో సోషల్ మీడియాలో తన దైన శైలిలో ప్రజంట్ చేశారు.

### రవి కసి తీర్చుకుంటున్నరా..

ప్రముఖ టీవి చానల్ సీఈవోగా పనిచేసిన రవి ప్రకాశ్ తెలంగాణ ఉద్యమంలో వ్యతిరేక భావజాలంతోనే ఉన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత కూడా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలపై అనుచితంగా వార్తలు ప్రసారం చేసారన్న అపవాదు ఉంది. దీంతో సీఎంగా ఉన్న కేసీఆర్ వరంగల్ వేదికగా ఆ చానల్ ను వంద మీటర్ల లోతు పాతిపెడతామని హెచ్చరించి నిషేధాజ్ఞలు జారీ చేశారు. అప్పట్నుంటి కేసీఆర్ వర్సెస్ రవి ప్రకాశ్ గా యుద్ధం సాగుతూనే ఉన్నది. ఈ లోగా ఆ సంస్థను ప్రముఖ పారిశ్రామికవేత్త రామేశ్వర్ రావు అండ్ కో కొనుగోలు చేయడం, రవిని బయటకు పంపడం చకచకా జరిగాయి. కేవలం కేసీఆర్ వల్లే తన కెరీర్ బుగ్గిపాలైందనే ఆక్రోశంతో రవి ప్రకాశ్ ఉన్నట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత ప్రభుత్వం లో ఉన్న కేటీఆర్ ఇతర పెద్దలతో మంతనాలు సాగించి ఓ చానల్ కూడా ప్లాన్ చేసినట్టు అప్పట్లో వార్తలొచ్చాయి. అయితే బీఆర్ఎస్ నాయకత్వం రవిని అంతగా నమ్మకపోవడంతో పాటు ఆ ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లలేకపోయిందన్న అపవాదు ఉంది. దీంతో రవి మరింత ఆక్రోశంతో సందర్భం వచ్చిన ప్రతీసారి బీఆర్ఎస్ నాయకత్వానికి అడ్డగా వార్తలు ప్రజంట్ చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే 2023 ఎన్నికలకు ముందు ప్రీ పోల్ సర్వే, పార్లమెంట్ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ లో బీఆర్ఎస్ గ్రాఫ్ దారుణంగా పడిపోతుందని చెప్పేశారు. ఈ వార్తలు కొంత ప్రభావి తం చేశాయని కూడా పార్టీ నాయకత్వం భావిస్తోం ది. తాజాగా కవితకు బెయిల్ రావాలంటే కేసీఆర్ కాంప్రమైజ్ కావాల్సిందేనని బీజేపీతో మంతనాలు సాగుతున్నాయనే ప్రచారాన్ని వార్తలకెక్కించి మరిం త కిక్కు పుట్టించారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### 24 గంటల టైం ఇస్తున్నా...

**లీగల్ యాక్షన్ ఉంటుంది..: కేటీఆర్**



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం లేదు.. అలా తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పైనా, విలీనం లాంటి ఎజెండా పూరిత దుష్ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని కేటీఆర్ హెచ్చరించా రు. 24 సంవత్సరాలుగా ఇలాంటి అనేక కుట్రలు, కుతంత్రాలు, కుట్రదారులను ఎదుర్కొన్న పార్టీ మాది. ఇవన్నీ ఎన్నో ఎన్నెన్నో దాటుకొని సుమారు పాతిక సంవత్సరాలు నిబద్ధతతో, పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్. సాధించుకున్న తెలంగాణ సగర్వంగా నిలబెట్టుకొని, అభివృద్ధిలో అగ్రపథాన నిలిపాం. ఆత్మగౌరవం, అభివృద్ధిని పర్యాయపదాలుగా మార్చుకొని ఇతర రాష్ట్రాలకి ఆదర్శంగా ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం. కోట్లాది గొంతుకలు, హృదయాలు తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ గుర్తింపు కోసం పోరాడుతున్నాయి కాబట్టే ఇది సాధ్యమైంది. ఎప్పటి లాగే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం నిలబడుతుంది.. పోరాడుతుంది. ఇప్పటికైనా అడ్డగోలు అసత్యాలను, దుష్ప్రచారాలను మానుకోవాలి. పడతాం, లేస్తాం.., తెలంగాణ కోసమే పోరాడుతాం... కానీ తలవంచం.. ఎన్నటికైనా... ఎప్పటికైనా....... అని కేటీఆర్ తేల్చి చెప్పారు.

# ఆగని దారుణాలు..

- ఇద్దరు యువతులపై లైంగికదాడి..
- బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- బేగంపేట పీఎస్‌లో కేసులు నమోదు..
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**జనపదం, హైదరాబాద్ క్రైమ్:** వేర్వేరు ఘటనల్లో యువతులు లైంగికదాడికి గురయ్యారు. బేగంపేట్ పీఎస్ పరిధిలో మంగళవారం ఇద్దరు యువతులు తమపై జరిగిన లైంగికదాడి పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్న రాజ్‌కుమార్ (28) ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువతితో పరిచయం పెంచుకున్నాడు.యువతిని ప్రేమిస్తున్నానని నమ్మబలికి జూన్ 24న బేగంపేట్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడి పాల్పడ్డాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువతికి ఫోన్ చేసి మరోసారి హోటల్‌కు రావాలని బెదిరించాడు. యువతి నిరాకరించడంతో రాజ్‌కుమార్ దుర్భాషలాడాడు. దీంతో మానసిక వేదనకు గురైన బాధితురాలు ఈ నెల 4వ తేదీన దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బేగంపేట్ పీఎస్‌కు బదిలీ చేశారు.

### మరో ఘటనలో..

యువతిపై లైంగికదాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తిపై బేగంపేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన యువతి (29)కి వరంగల్ జిల్లా గుండ్ల సింగారానికి చెందిన కందుకూరి ప్రశాంత్ పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇద్దరి మధ్య పరిచయం పెరగడంతో తన ఉద్యోగం, బైక్ కొనుగోలు, అవసరాల కోసం డబ్బులు కావాలంటూ బాధితురాలి నుంచి డబ్బులు వసూలు చేశాడు. పెద్ద మొత్తంలో ఉన్న ప్రశాంత్ అప్పులను తీర్చేందుకు పలుసార్లు రూ. 14.60 లక్షల వరకు బాధితురాలు ఇచ్చింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌లోని ఓ గదికి తీసుకొచ్చి లైంగికదాడి చేశాడు. ఆ తరువాత పెళ్లి చేసుకోవాలని అడిగితే బాధితురాలిపై దాడి చేసి, కులం పేరుతో దూషించాడు. పెళ్లి విషయం దాటవేస్తూ, తప్పించుకుని తిరుగుతుండటంతో బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# రాజ్యసభలో ఖాళీ స్థానాలకు ఉప ఎన్నిక

**12 స్థానాలకు ఎన్నిక షెడ్యూల్**

**ఆగస్టు 14వ తేదీన నోటిఫికేషన్ రిలీజ్**




**జనపదం, ఢిల్లీ:** రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం ఎన్నిక షెడ్యూల్‌ని విడుదల చేసింది. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 స్థానాలకు ఈ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. అస్సాం, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల నుంచి 10 మంది సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. అలాగే, తెలంగాణ, ఒడిశా నుంచి ఒక్కొక్కరు తమ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తెలంగాణలో కే. కేశవరావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో తెలంగాణలో ఒక స్థానం ఖాళీ అయ్యింది.

### ఎన్నికల షెడ్యూల్ వివరాలివే..

12 రాజ్యసభ స్థానాల ఎన్నికకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 14వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆగస్టు 21వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అలాగే.. బీహార్, హర్యానా, రాజస్థాన్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీని చివరి తేదీగా ప్రకటించారు. సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

# ధైర్యంగా ఉండండి..

- సమస్యలను పోరాడి గెలుద్దాం..
- ఆత్మహత్యలతో కుటుంబాలు ఆగం..
- మాజీ మంత్రి హరీష్ రావు



**జనపదం, హైదరాబాద్:** రైతులెవ్వరూ అధైర్యపడొద్దు, ఏమైనా సమస్యలుంటే పోరాడి పరిష్కరించుకుందాం అని ఎమ్మెల్యే హరీశ్ రావు రైతులకు ధైర్యం చెప్పారు. ఖమ్మం జిల్లాలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం జాన్‌పహాడ్ తండాకు చెందిన రైతు ఏలేటి వెంకట్‌రెడ్డి మృతి బాధాకరమని, ఆవేదనకు గురి చేసిందన్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన వెంకట్‌రెడ్డి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి మరణించడం ప్రజాపాలనపై రైతులు కోల్పోతున్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ఇటీవలే ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలంలో జరిగిన రైతు ఆత్మహత్య ఘటన మరువక ముందే మరో రైతు మరణించడం శోచనీయమని అన్నారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, చావుతో భార్యబిడ్డలను రోడ్డున పడేయొద్దన్నారు. ప్రాణం తీసుకుంటే సమస్యలు తీరుతాయనుకోవడం సరికాదని, బతికి సాధించుకోవాలని ఒక ప్రకటనతో హరీశ్ రావు పేర్కొన్నారు.

# మొక్కుబడిగా మాఫీ..

- రుణమాఫీ రైతు పక్షం కాదు.. ప్రభుత్వ పక్షం..
- సీఎంకి దమ్ముంటే క్షేత్ర స్థాయిలో సదస్సులు పెట్టి మాఫీపై సమీక్షించాలి..
- మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్



**జనపదం, బ్యూరో:** రైతు రుణ మాఫీ రైతు పక్షం కాదని కేవలం ప్రభుత్వ పక్షమని మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అర్హులై రుణమాఫీ కాని రైతులు ఫిర్యాదు చేయాలని ఫోన్ నెంబర్ ఇస్తే దాదాపు 3500 ఫోన్ కాల్స్ , 40 వేలకు పైగా వాట్సాప్ మెసేజ్ లు రైతుల నుంచి వచ్చాయన్నారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన రుణమాఫీ ఏస్థాయి లో అమలవుతుందో తెలంగాణ భవన్ ఫోన్ నెంబర్ కు వచ్చిన ఫిర్యాదులే సాక్ష్యమన్నారు. మాఫీకి మరిదేనికి లింక్ పెట్టడం లేదని పైనున్న వారు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని తమకందని ఫిర్యాదులు తేల్చాయన్నారు. ఆధార్ కార్డు లో చిన్న తప్పులు ఉన్నాయని కొందరు చెబితే, వీసా ఉందని మాఫీ తిరస్కరించారని మరికొందరు పేర్కొన్నారన్నారు. కొన్ని తండాల్లో భూ రికార్డులు సరిగా లేవని రుణ మాఫీ చేయలేదన్నారు. కేవలం బీ ఆర్ ఎస్ ఒత్తిడితో దేవుళ్ళ మీద ఒట్లు వేశానని రేవంత్ రెడ్డి తూతూ మంత్రంగా రుణ మాఫీ చేస్తున్నారని దుయ్యబట్టారు.

### అప్పటికి ఇప్పటికి తేడా అదే..

కేసీఆర్ హయం లో అన్నదాతలకు రైతు బంధు రూపం లో 72 వేల కోట్ల రూపాయలు, రుణమాఫీ రూపంలో మరో 30 వేల కోట్ల రూపాయలు అందించామన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు రైతు భరోసా ఎగ్గొట్టారని, పంటలకు బోనస్ బోగస్ చేశారని, రైతు భరోసా, బోనస్ డబ్బులు మిగుల్చుకుని వాటినే రుణమాఫీకి కేటాయించారన్నారు. రైతు పంట రుణాల ఆధారంగా అందరికీ రుణ మాఫీ చేయాలనీ బీ ఆర్ ఎస్ డిమాండ్ చేస్తోందని పెద్ది పేర్కొన్నారు. బ్యాంకర్లకు లేని నిబంధనలు ప్రభుత్వానికి ఎందుకని నిలదీశారు. తమ ఫిర్యాదుల నెంబర్ కు గంటకు దాదాపు 900 ఫోన్ కాల్స్ వస్తున్నాయంటే రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కి దమ్ముంటే క్షేత్ర స్థాయి లో రైతు సదస్సులు పెట్టి రుణ మాఫీ పై సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా సమీక్షకు ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం విహార యాత్రలకే పరిమితమైందన్నారు. రాష్ట్రం లో సగం మంది రైతులకు కూడా రుణ మాఫీ కాలేదని, రుణ మాఫీ కాని రైతుల పక్షాన బీ ఆర్ ఎస్ పోరాడుతుందని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. అలాగే సివిల్ సప్లై కుంభ కోణం పై త్వరలోనే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకు జరిగిన అవమానం సంపత్ చేసింది కాదని సర్కార్ చేసిందని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పెట్టుకుని ఊరేగుతారని, ఆ రాజ్యాంగాన్ని తుమ్మిళ్ల లో సంపత్ అవమానించారన్నారు. తుమ్మిళ్ల లిఫ్టు నే కాదు ఆ నీళ్లను తాకే అర్హత కూడా కాంగ్రెస్ కు లేదని, నడిగడ్డ లో కాంగ్రెస్ రక్తం పారిస్తే బీ ఆర్ ఎస్ ప్రభుత్వం నీళ్లు పారించిందన్నారు. కాంగ్రెస్ దాష్టీకాలపై ఆలంపూర్ లో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తాని ప్రకటించారు.

# వాయనాడ్‌కు నరేంద్రమోడీ

**శనివారం బాధితులను పరామర్శించనున్న ప్రధాని..**

**జనపదం, న్యూఢిల్లీ :** ప్రకృతి కన్నెర్రతో కేరళలోని వాయనాడ్ జిల్లా ముండక్కై, చురల్‌మల తదితర ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో సుమారు 500 మంది వరకు ప్రాణహాని కలిగింది. ఈ ఘటనలో గల్లంతైన వారి కోసం ఇంకా సహాయకచర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమం లో శనివారం వాయనాడ్ ప్రాంతాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించనున్నారు. కన్నూర్ విమానాశ్రయంలో దిగిన తర్వాత హెలికాప్టర్‌లో వాయనాడ్ చేరుకుంటారని, విపత్తు ప్రాంతాన్ని, శిబిరాన్ని సందర్శిస్తారని అధికారులు తెలిపారు.

### వందలాది మంది గల్లంతు

వాయనాడ్ దుర్ఘటనలో 224 మంది మరణించినట్లు ఇప్పటి వరకు అధికారులు చెబుతున్నారు. అయితే 414 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. చనిపోయిన వాళ్లతో పాటు మరికొందరు ఆచూకీ తెలియాల్సి ఉంది. 154 మంది గల్లంతైనట్లు అంచనా కాగా, 88 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో శనివారం వాయనాడ్ కు రానున్న ప్రధాని బాధిత ప్రజలు నివసించే శిబిరాలను సందర్శించనున్నారు.



## హైదరాబాద్ అభివృద్ధికి సహకరించండి..

- ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాను కోరిన సీఎం
- పెట్టుబడులే టార్గెట్ రేవంత్ రెడ్డీ టీమ్ పర్యటన..
- ఫార్మా గ్లాస్ ట్యూబ్‌ల తయారీ కేంద్రం ఏర్పాటుకు రెడీ

**జనపదం, బ్యూరో:** తెలంగాణలో పెట్టుబడులే టార్గెట్‌గా సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ అమెరికాలో బిజీబిజీగా పర్యటిస్తోంది. న్యూయార్క్ పర్యటన తర్వాత వాషింగ్టన్ చేరుకున్న సీఎం రేవంత్ బృందం బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశమైంది. చర్చల్లో భాగంగా హైదరాబాద్ 4.0 అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అజయ్ బంగాను కోరారు. మూసీ పునరుద్ధరణ, ఫ్యూచర్ సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు వివరించారు. అంతకుముందు వివిధ ఫార్మా కంపెనీలతో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి బృందం, ప్రధాన పెట్టుబడులను ఆకర్షిస్తూ పలు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలలో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకే పలు కంపెనీలు భాగస్వామ్యమయ్యాయి. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డితో వివింట్ ఫార్మా ప్రతినిధుల చర్చలు జరిపారు. రూ.400 కోట్లతో వివింట్ ఫార్మా విస్తరణకు కంపెనీ ప్రతినిధుల అంగీకారం తెలిపారు. జీనోమ్ వ్యాలీలో ఇంజిక్షన్ల తయారీ కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ ప్రపంచంలో పేరొందిన కార్నింగ్ ఇన్ కార్పొరేటేడ్ కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కార్నింగ్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఫార్మా గ్లాస్ ట్యూబ్‌ల తయారీ కేంద్రం ఏర్పాటుకు సిద్ధమైనట్లు తెలిపారు. 2025 నుంచి ఈ ఉత్పత్తి ప్రారంభమయ్యేలా డీల్ కుదుర్చుకున్నారు. సమావేశంలో అధికారికంగా అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ అత్యాధునిక గ్లాస్ ట్యూబ్ తయారీ కేంద్రం ఫార్మా రంగం అభివృద్ధికి దోహదపడుతుంది. ఔషధాల ప్యాకేజింగ్ పరిశ్రమలో ఈ గ్లాస్ ట్యూబ్‌లను ఉపయోగిస్తారు. వీటి తయారీకి వినూత్నమైన వెలాసిటీ గ్లాస్–కోటింగ్ టెక్నాలజీని ఈ కంపెనీ వినియోగిస్తోంది. ఈ కొత్త సదుపాయంతో తెలంగాణలో ఇప్పటికే వేగంగా విస్తరిస్తున్న ఫార్మాస్యూటికల్ రంగంలో ఉత్పాదకత సామర్థ్యం మరింత మెరుగుపడుతుందనే అంచనాలున్నాయి.



## సత్తి బిత్తిరి పని..

### సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**జనపదం, హైదరాబాద్ :** బిత్తిరి సత్తిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భగవద్గీతను కించపర్చేలా వీడియో చేశాడంటూ ఆయనపై వానరసేన ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సత్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బిల్లుగీత అంటూ బిత్తిరి సత్తి పేరడీగా ఒక షాట్ వీడియో చేశాడు. వీడియోలో భగవద్గీతను అనుకరిస్తూ తనదైన శైలిలో వ్యంగ్యంగా వీడియో చేశాడు. దీనికి సంబంధించిన నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోపై హిందూ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆ వీడియోను తొలగించి క్షమాపణలు చెప్పాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




## పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ వెరిఫికేషన్

**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇటీవలే రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచినట్లు టీజీపీఎస్సీ ప్రకటించారు. పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో పిలిచారు. సెప్టెంబర్ 20 నుంచి 26వ తేదీ వరకు అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో రోజూ ఉదయం 10:30 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. వెబ్ ఆప్షన్లు సెప్టెంబర్ 19 నుంచి 28వ తేదీ వరకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. కమిషన్ వెబ్‌సైట్ నుంచి చెక్ లిస్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. చెక్ లిస్ట్‌లో ఉన్న ప్రతి పత్రంపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించుకోవాలని, తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

# మంటల్లోనే బంగ్లా..

- ఆందోళనలకు 440 మంది బలి..
- వేటాడుతున్న ఆందోళనకారులు
- అవామీ లీగ్ నేతలే టార్గెట్..
- ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న నోబెల్ శాంతి పురస్కార గ్రహీత





**జనపదం, న్యూ ఢిల్లీ :** బంగ్లా మంటలు ఇంకా చల్లారలేదు. రిజర్వేషన్ల రద్దుకోసం జరిగిన హింసాకాండలో వందల మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ నిరసన మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలకు మృత్యుపాశంగా మారింది. ఆందోళనకారులు అవామీ లీగ్ నేతలను వెంటాడి, వేటాడుతున్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ అవామీ లీగ్ నేతల మృతదేహాలు కనిపిస్తున్నాయి. **అక్కడి మీడియా కథనాల ప్రకారం...** బంగ్లాదేశ్ వ్యాప్తంగా 29 మంది మృతదేహాలను గుర్తించారు. అందులో 20 అవామీ లీగ్ నేతలు ఉన్నట్లు అక్కడి మీడియా సంస్థలు వెల్లడించాయి. సాత్ఖిరా ప్రాంతంలో 10 మంది, కొమిల్లాలో 11 మంది దాడుల్లో ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అశోక్తలాలో ఒక మూక మాజీ కౌన్సిలర్ ఎండీ షా ఆలం ఇంటికి నిప్పుపెట్టినట్లు తెలిపింది. ఇందులో ఐదుగురు టీనేజర్లతో పాటు మొత్తం ఆరుగురు సజీవదహనమైనట్లు తెలుస్తోంది. నటోరె ప్రాంతంలో ఆందోళనకారులు ఒక ఎంపీ ఇంటికి నిప్పుపెట్టారు. ఆ ఇంట్లోని గదులు, బాల్కనీలు, పైభాగంలో తాజాగా మృతదేహాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా పేర్కొంది.

**సినీనటుడి హత్య**

ఆగ్రహంతో ఊగిపోతున్న ఆందోళనకారులు అవామీ లీగ్ పార్టీతో సంబధాలున్నవారిపై దాడులు చేస్తున్నారు. దొరికినోళ్లను దొరికినట్లుగా ఊచకోత కోశారు. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశారని తెలియగానే, నిరసన కారులు ఆమె మద్దతుదారులపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో యువ నటుడు శాంతో, దర్శకుడైన అతడి తండ్రిని నిరసనకారులు అతికిరాతకంగా చంపారు. నిరసనకారులు వీరిని చుట్టుముట్టి కర్రలతో కొట్టి చంపినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. ఈ నటుడు గతంలో హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ బయోపిక్‌లో నటించారు.

**24 మంది సజీవ దహనం**


బంగ్లాదేశీ జానపద గాయకుడు రాహుల్ ఆనందోకు చెందిన నివాసానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. నిరసనకారులు దాడి చేయగానే రాహుల్ కుటుంబం అక్కడినుంచి పారిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వారు రహస్య ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. జషోర్ జిల్లాలో అవామీలీగ్ నేతకు చెందిన హోటల్‌కు అల్లరిమూకలు నిప్పుపెట్టాయి. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మూడు వారాల ఆందోళనల్లో ఇప్పటి వరకు 440 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఒక్కరోజే 109 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

**షేక్ హసీనాను అప్పగించండి..**

*అల్లర్లకు, మరణాలకు ఆమె కారణం..*

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన సోదరి షేక్ రెహనాతో కలిసి భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వీరు లండన్ వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో సరికొత్త డిమాండ్ ప్రారంభమైంది. షేక్ హసీనాతోపాటు ఆమె సోదరిని వెంటనే అరెస్ట్ చేసి బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను ఆ దేశపు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు ఏఎం మహబూబ్ ఉద్దీన్ ఖోకాన్ డిమాండ్ చేశారు. ఢాకాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహబూబ్ ఉద్దీన్ ఖోకాన్ మాట్లాడుతూ.. పొరుగనున్న భారత్‌తో సానుకూల సంబంధాలు కొనసాగించడం తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ అల్లర్లలో వందలాది మంది ప్రజలు మరణించారన్నారు. అందుకు షేక్ హసీనా పూర్తి బాధ్యత వహించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోదరితోపాటు ఆమెను అరెస్ట్ చేసి బంగ్లాదేశ్‌కు తిరిగి పంపాలని భారత్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

**నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నేతృత్వంతో తాత్కాలిక ప్రభుత్వం**



రాజకీయ సంక్షోభం తలెత్తిన బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వం వహించనున్నారు. అధ్యక్షుడు మొహమ్మద్ షహబుద్దీన్ – నోబెల్ గ్రహీత యూనస్‌ను సారథిగా నియమిస్తున్నట్లు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ప్రకటన వెలువరించారు. పారిస్‌లో ఉన్న ఆయన .. గురువారం మధ్యాహ్నం ఢాకా చేరుకోనున్నారు. తాత్కాలిక ప్రభుత్వానికి యునిస్ నాయకత్వం వహించనున్నారు. 24 గంటల్లో లేదా మరి కొన్ని గంటల ఆలస్యంతో.. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు జరుగుతుందని యాంటీ డిస్క్రిమినేషన స్టూడెంట్ మూవ్‌మెంట్ కోర్డినేటర్ నహిద్ ఇస్లామ్ తెలిపారు. దేశాధ్యక్షుడితో జరిగిన మీటింగ్‌లో డాక్టర్ మహమ్మద్ యునిస్ పేరు ప్రతిపాదనకు వచ్చినట్లు నహిద్ వెల్లడించారు.

# గనుల పాత్ర కీలకం..

- దేశ ఆర్థిక వ్యవస్థలో అవే ప్రధానం..
- ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధిలో మైనింగ్ పాత్ర మరువలేనిది
- ఖనిజవనరులను సద్వినియోగం చేసుకోవాలి..
- మైనింగ్ రంగం అభివృద్ధికి చర్యలు
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- ముందుకెళ్తున్న సంస్థలకు 5 స్టార్ రేటింగ్స్ ప్రదానం
- వచ్చే ఏడాది 7 ఉత్తమ సంస్థలకు 7 స్టార్ రేటింగ్స్ అందిస్తామని హామీ



**జనపదం, న్యూఢిల్లీ :** దేశ ఆర్థికాభివృద్ధిలో గనుల రం గం పోషిస్తున్న పాత్ర కీలకమని, రానున్న రోజుల్లో దేశం గనుల రంగంలో స్వయం సమృద్ధి సా ధించే దిశగా మరింత కృషి జరగాలని కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో దేశవ్యాప్తంగా అత్యున్నత ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ చేస్తున్న 68 సంస్థలకు మంత్రి 5 స్టార్ అవార్డుల ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో తెలంగాణ నుంచి 5, ఆంధ్రప్రదేశ్ నుంచి 5 మైనింగ్ సంస్థలున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నది మైనింగ్ పరి శ్రమే అన్నారు. మైనింగ్ రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు పనిచేస్తున్న వారందరినీ అభినందించడం కేంద్రం బాధ్యతన్నారు. అవార్డులు మైనింగ్ రంగం చేస్తున్న కృషిని ప్రోత్సహించడానికి అని పేర్కొన్నారు.

**దేశాభివృద్ధిలో భాగం కావాలి..**

మైనింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ హైదరాబాద్ లో ఓ వర్క్ షాప్ నిర్వహించిందని మంత్రి గుర్తు చేశారు. ఆ కార్యక్రమంలో మైనింగ్ పరిశ్రమ ప్రతినిధులు ఇచ్చిన సూచనల ఆధారంగా కొత్త నిబంధలను నిర్దేశించుకుని ముందుకెళ్తున్నామన్నారు. మైనింగ్ రంగం, మంత్రిత్వ శాఖ సమన్వయంతో పనిచేస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో అపారమైన ఖనిజ సంపద ఉందని, సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాల న్నారు. క్రిటికల్ మినరల్స్ ను దిగుమతి చేసుకుంటున్నామని, దేశంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే ఆ అవసరం ఉందన్నారు. ఇటీవల బడ్జెట్లో 25 క్రిటికల్ మినరల్స్ మీద కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తొలగించిందని, దాంతో దేశంలో క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ మెరుగుపడుతుందని కిషన్ రెడ్డి చెప్పారు. దేశం ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, రానున్న రోజుల్లో 3వ ఆర్థిక వ్యవస్థగా మారాలన్నారు. ఈ దిశగా మైనింగ్ రంగం తమ సామర్థ్యానికి అనుగుణంగా పనిచేయాలని మంత్రి కోరారు.

**సాంకేతికను వినియోగించుకోవాలి..**

మైనింగ్ లో సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధితోపాటు పర్యావరణాన్ని కాపాడేలా పని చేయాలని కంపెనీలకు మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. గనులు, కార్మికుల భద్రత, ఉత్పత్తి పెంచడం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సాంకేతికత వినియోగం చాలా అవసరం అని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన వారిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే జీ, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, అదనపు కార్యదర్శి లోహియా, ఐబీఎం సెక్రటరీ జనరల్ పీఎన్ శర్మతోపాటు ఆయా రాష్ట్రాల గనుల శాఖ ఉన్నతాధికారులు, అవార్డు గ్రహీతలు, మైనింగ్ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ నుంచి 5 (అన్నీ లైమ్ స్టోన్ మైన్స్)**

- ★ భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్ – కడప
- ★ JSW సిమెంట్స్ లైమ్ స్టోన్ – నంద్యాల
- ★ దాల్మియా సిమెంట్స్ నవాబ్‌పేట – తలమంచిపట్నం.
- ★ అల్ట్రాటెక్, తుమ్మల పెంట
- ★ శ్రీ జయజ్యోతి (మైహోం) సిమెంట్స్, కర్నూల్

**తెలంగాణ నుంచి 5 (అన్నీ లైమ్ స్టోన్ మైన్స్)**

- ★ మైహోం చౌటుపల్లి–1
- ★ TSMDC – దేవాపూర్ (మంచిర్యాల)
- ★ మైహోం – మేల్ల చెరువు
- ★ రైన్ సిమెంట్స్ – నల్గొండ
- ★ సాగర్ సిమెంట్స్ – నల్గొండ

# మైనార్టీ బాలుర గురుకులంలో ఫుడ్ పాయిజన్

### 40 మంది విద్యార్థులకు అస్వస్థత



**స్పాట్ వాయిస్, మహబూబ్ నగర్:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కస్తూర్బాల్లోని విద్యార్థులకు తరుచూ ఫుడ్‌పాయిజన్ అవుతూనే ఉన్నది. బుధవారం జడ్చర్ల లోని మైనార్టీ బాలుర ఇంగ్లిష్ మీడియం గురుకులంలో 40 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన 9 మందిని అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయం అల్పాహారంలో భాగంగా కిచిడీ చేసిన తర్వాత 10 గంటల సమయంలో పలువురు కండుపు నొప్పి తోపాటు వాంతులు చేసుకున్నారు. వైద్యులకు సమాచారం ఇవ్వడంతో స్కూల్‌కు వచ్చి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేంద్రబోయి, అదనపు కలెక్టర్ విజయేంద్రప్రతాప్ గురుకులానికి చేరుకొని అస్వస్థతకు గురైన విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలతో పాటు వండిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



# రేవంత్ అండ్ బ్రదర్స్..

- ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ కుటుంబ పాలన..
- రాష్ట్ర పాలన అస్తవ్యస్తం..
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం..

**జనపదం, హైదరాబాద్ :** రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ కుటుంబ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, రాజేష్ నాయక్ తదితరులతో కలిసి బాల్క సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలారన్నారు. వారికి ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్న తీరు యా వత్ తెలంగాణ చూస్తోందని దుయ్యబట్టారు. చట్టసభ సాక్షిగా అసెంబ్లీ కమిటీ హాల్ లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నారని గుర్తు చేశారు. కొడంగల్ లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే జెడ్పీటీస్ మహిపాల్ అడ్డుకున్నారని, మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా లేకున్నా అధికారులతో కలిసి ఆస్ట్రేలియా లో పర్యటిస్తున్నారన్నారు. ఆయనకు పదుల సంఖ్యలో కాన్వాయ్ వాహనాలు, అధికారుల రాచమర్యాదలు నిత్య కృత్యమయ్యాయన్నారు..

**సోదరుల కంపెనీలతో డీల్స్..**

సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ఛ బయోతో వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నారని, ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిదని, కేవలం పదిహేను రోజుల కిందట ఏర్పాటైందన్నారు. ఇవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో మరో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయని వాటితోనే బ్లాక్ మనీని వైట్ గా మార్చే పనిలో సీఎం ఉన్నారన్నారు. సీఎం సోదరులు అనేక మైక్రో సంస్థ ల్లో డైరెక్టర్లు గా ఉన్నారని, రియల్టర్ల ను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని బాల్క ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో రేవంత్ సోదరుల సామ్రాజ్యం విస్తరిస్తోందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ బుద్ధి జీవులు, మేధావులు రేవంత్ సోదరుల ఆగడాలపై స్పందించాలని కోరారు. డొల్లా కంపెనీలతో కంపెనీలతో పెట్టుబడులు పెట్టిస్తే తెలంగాణ పరువు ఏమవుతుందో ఆలోచించాలన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి శాశ్వత సీఎంగా వ్యహరిస్తున్నారని, ఇలాంటి బోగస్ పనులు మానుకోవాలన్నారు. బీఆర్ ఎస్ పద్నాలుగేళ్లు రాష్ట్రం కో సం పోరాడిందని, పదేళ్లు అభివృద్ధి కోసం కృషి చే సిందన్నారు. బీజేపీలో విలీనం అవుతుందని అంటే న మ్మొద్దన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ బీ ఆర్ ఎస్ కచ్చితంగా ఉంటుందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడుతుందని సుమన్ తేల్చి చెప్పారు.



## అందరి సహకారంతో ఉత్సవాలు

- ఉత్సవ సమితి బాధ్యులు..
- పూజా కార్యక్రమాలతో గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం

**జనపదం, భాగ్యనగరం :** భాగ్యనగరం పరిధిలో 45వ సామూహిక గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం బుధవారం ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. స్థానిక బాహెతి భవన్ లో ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఓపెన్ చేశారు. ఈ సంవత్సరం లక్షకు పైగా గణేష్ మండపాలను ప్రతిష్ఠించనున్నామని, యేటా సహకరించినట్టుగా ఇప్పుడు కూడా కొత్త ప్రభుత్వం ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా అన్ని విభాగాల సమన్వయంతో ఉత్సవ సమితికి సహకరించాలని సమితి నిర్వాహకులు కోరారు. దైవ భక్తి , దేశ భక్తి , స్వదేశం, స్వధర్మం, స్వసంస్కృతుని సంరక్షించే ఉత్సాహభరితమైన వాతావరణంలో 45వ సామూహిక గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి రోజున మండపాలను నిర్వహించి, సెప్టెంబర్ 17న సామూహిక నిమర్జనం జరుపుతామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి రాజ వర్ధన్ రెడ్డి, కార్యదర్శులు రావినూతల శశిధర్, కౌడి మహేందర్, రమేష్, ఉపాధ్యక్షులు మెట్టు వైకుంఠం, కోశాధికారు శ్రీరామ్ వ్యాస్, కమిటీ సభ్యులు ఆలే భాస్కర్, రూప్ రాజ్, సలహాదారులు కరోడిమల్, మాధవి లత తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## సొమ్మెంత.. సోకెంతా..?

- సీఎం టూర్ లో ఫ్యామిలీ పరివార్
- బోగస్ కంపెనీలతో డీల్ అని బీఆర్ ఎస్ విమర్శ
- తట్టుకోలేకే అవాక్కులని సర్కార్ కౌంటర్..




**జనపదం, బ్యూరో:** దోని సప్పుడేగానీ.., దొయ్యపారేది ఉందా.. లేదా...? అడుగుతారని వెళ్తున్నారా.., అవసరాలు తీర్చుకోవడానికి పోతున్నారాగానీ టూర్ల పరంపర సాగుతూనే ఉంది. అన్నేమో పశ్చిమకు.., తమ్ముడేమో తూర్పుకు అన్నట్టుగా ఫండ్స్ రేజింగ్ పర్యటనలు సాగుతూనే ఉన్నాయి. నోళ్లు మూయిస్తాం., కొలువులిప్పిస్తాం.., బతుకులు మారుస్తాం.., చరిత్ర లిఖిస్తామని.. పెద్దపెద్ద మాటలతో సీఎం అండ్ టీం విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు.., వస్తున్నారు. నిజానికి తరలి వచ్చేవి ఎన్ని.., వాటి స్థాయి ఏపాటిది..? నిలుస్తాయా..? అనుకున్నవన్నీ చేసి చూపుతాయా..? అనేవి తేలడానికి ఇంకా సమయమున్నా రేవంత్ అండ్ ఫ్యామిలీ గా సాగుతున్న డీల్స్ మాత్రం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పాత సీసాలో కొత్త సారా మాదిరిగా అంత దూరం వెళ్లి ఆయన తమ్ములు, అన్నల కంపెనీలతోనే లావాదేవీలు జరుపుతున్నారనే అపవాదు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం. పెద్దపెద్ద కంపెనీలను కాదని, పెట్టుబడి రంగంలో అనుభవమున్న పెద్దలను వదిలేసి, చోటామోటలను, నయా సంస్థలను నమ్మి పేపర్లు మార్చుకునే తంతును జరుపుతుండడం అనుమానాలు రేకెత్తిస్తుంది. సీఎం పర్యటన అంతా సొమ్ములు తెచ్చుడేమోగానీ సోకులు చూపుకోవడానికే అన్నట్టుగా మారింది. చేతినిండా పనులు దొరికేలా పెట్టుబడులు తీసుకురావాల్సిన తరుణంలో ముఖ్యమంత్రి ఆయన అనుచర గణం చేతి చమురు వదిలించుకునేలా చేస్తోందని బీఆర్ ఎస్ దుమ్మెత్తిపోస్తోంది. కేటీఆర్ ఇంగ్లిష్ చూసో, అడిగారనో తెలంగాణకు కు పెట్టుబడులు రాలేదు., కాంగ్రెస్ కూడా పెట్టుబడులు తేగలదు అని చెప్పే ప్రయత్నంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారనే వారు లేకపోలేదు. ఏదిఏమైనా అప్పుడు కేటీఆర్, ఇప్పుడు రేవంత్ ఇద్దరి ఆరాటం పెట్టుబడుల కోసమే కావొచ్చునుగాక కానీ రాజకీయం కోసం వాడుకోవడానికి తిరగడం మాత్రం సరికాదని మరికొందరి వాదన. తెస్తే మంచిదే., గానీ వత్తాన పోతానా ఓ రామచిలుక.. రా... పో... గోడల్లో మొలక... అన్నట్టుగా సాగితేనే అసలుకే మోసం వస్తుందనే విషయం అంతా గుర్తెరిగితే మంచిది.

# సమంత టాప్..
# రెమ్యునరేషన్ 10 కోట్లు..

**టాలీవుడ్ టాప్ హీరోయిన్లలో** సమంత ఒకరు. పుష్ప చిత్రంలో ఊ.. అంటావా.. మామ. ఊ..ఉ అంటావా మామ అంటూ ఐటెమ్ సాంగ్ చేసి అందరికి షాక్ ఇచ్చింది. తాజాగా ఈ అందాల భామ సమంత మళ్లీ హాట్‌టాపిక్‌గా మారింది. ఫ్యామిలీ మాన్ వెబ్‌సీరిస్ తరువాత ఆమె నటిస్తున్న మరో వెబ్‌సీరిస్ సీటాడెల్ హానీ బన్నీ. ఇటీవల దీని టీజర్ కూడా విడుదలైంది. త్వరలో ఇది స్ట్రీమింగ్ కూడా కానుంది. సమంత ఈ వెబ్‌సీరిస్ కోసం 10 కోట్ల రూపాయల రెమ్యూనరేషన్ చార్జ్ చేసిందట. ఇది హీరోయిన్స్ పారితోషికాల్లో సౌత్ ఇండియాలోనే సరికొత్త రికార్డ్. గతంలో కూడా సమంత తెలుగు సినిమాలకు అత్యధిక ఫీజునే అందుకుంది. ఏకంగా 10 కోట్ల పారితోషికం మాత్రం ఇంతవరకు ఏ హీరోయిన్ రెమ్యూనరేషన్‌గా తీసుకోలేదట. ఇప్పుడు ఈ టాపిక్ బాలీవుడ్‌లో కూడా హాట్‌టాపిక్‌గా మారింది.






## 200 మిలియన్ వ్యూస్‌తో.. సుసేకి

**ఐకాన్ స్టార్ అల్లు అర్జున్**, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మూవీ 'పుష్ప-2' ప్రస్తుతం క్లైమాక్స్ సన్నివేశాల చిత్రకరణ జరుగుతోంది. పుష్ప-2 రిలీజ్‌కి ముందే పలు సంచలనాలకు కేరాఫ్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'పుష్ప పుష్ప', 'సూసేకి' అనే రెండు సాంగ్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇక ఈ పాటలు సోషల్ మీడియాలో దుమ్ములేపుతున్నాయి. తాజాగా 'సూసేకి' సాంగ్ యూట్యూబ్‌లో ఏకంగా 200 మిలియన్ వ్యూస్ మార్క్‌ను టచ్ చేసింది. ఈ పాటను ప్రముఖ సింగర్ శ్రేయ ఘోషల్ పాడారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ తనదైన స్టైల్‌లో ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. 'సూసేకి' పాటకి 2.12 మిలియన్ల లైకులు, 3.7 మిలియన్ల రీల్స్ అండ్ షార్ట్స్ చేశారు. సినిమాను డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.

# వయనాడ్ బాధితులకు రూ.2 కోట్లు..

### భారీ విరాళాన్ని ప్రకటించిన డార్లింగ్ ప్రభాస్

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటన యావత్ దేశాన్ని కన్నీరుపెట్టించింది. ఈ విలయంలో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో విపత్తులో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పలువురు ముందుకొస్తున్నారు. ఇప్పటికే సినీ తారలు, పలువురు రాజకీయ నేతలు తమ వంతు సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా టాలీవుడ్ స్టార్ నటుడు ప్రభాస్ భారీ విరాళాన్ని ప్రకటించారు. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 కోట్లు అందించనున్నట్లు ఆయన టీమ్ పేర్కొంది. ఇప్పటికే పలువురు స్టార్స్ విరాళాలు అందించిన విషయం తెలిసిందే. విక్రమ్ రూ.20 లక్షలు, హీరో సూర్య ఫ్యామిలీ జ్యోతిక, హీరో కార్తి కలిసి సంయుక్తంగా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలను అందించారు. అదేవిధంగా మలయాళ నటులు మోహన్‌లాల్ రూ.25 లక్షలు, మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్ సల్మాన్ కలిసి రూ.35 లక్షలు, ఫహాద్ ఫాజిల్ రూ.25 లక్షలు, రష్మిక 10 లక్షలు, స్టార్ హీరోయిన్ నయనతార, డైరెక్టర్ విఘ్నేశ్ శివన్ దంపతులు రూ.20 లక్షలను విరాళంగా అందించారు.





# మిస్టర్ బచ్చన్ ట్రైలర్ అదుర్స్

టాలీవుడ్ యాక్టర్ రవితేజ -హరీష్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. మిస్టర్ బచ్చన్ ట్రైలర్‌ను బుధవారం రాత్రి రిలీజ్ చేశారు. ఈ మేరకు ఓ పోస్టర్ ను సోషల్ మీడియాలో వదిలారు. రవితేజ స్టైలిష్ లుక్‌లో సిగరెట్ తాగుతూ వార్నింగ్ ఇస్తున్నట్టు ఉన్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. మిస్టర్ బచ్చన్ నుంచి ఇప్పటికే షేర్ చేసిన పోస్టర్లు, టీజర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా రవితేజ, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో విడుదల చేసిన సితార్, రెప్పల్ డప్పుల్ సాంగ్స్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తూ.. మంచి వ్యూస్ రాబడుతున్నాయి. సక్సెస్,ఫెయిల్యూర్ చుట్టాల్లాంటివి.. వస్తుంటాయ్.. పోతుంటాయ్.. యాటిట్యూడ్ ఇంటిపేరు లాంటిది.. అది పోయేదాకా మనతోనే ఉంటుందని టీజర్‌లో రవితేజ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.






# స్పిన్‌తో బోల్తాకొట్టించారు..

**వన్డే సిరీస్ శ్రీలంక కైవసం..**

**138 స్కోర్ వద్ద కుప్పకూలిన టీమిండియా**

**22ఏళ్ల తర్వాత భారత్ పరాభావం..**

**జనపదం, స్పోర్ట్స్:** భారత్ 22 ఏళ్ల అనంతరం శ్రీలంకలో పరాభావం చూసింది. శ్రీలంక పర్యటనలో భారత్ వన్డే సిరీస్ కోల్పోయింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక 110 పరుగుల తేడాతో నెగ్గింది. శ్రీలంక నిర్దేశించిన 249 పరుగుల లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియా 26 ఓవర్లలో 138 స్కోర్ కే కుప్పకూలింది. కెప్టెన్ రోహిత్ శర్మ (35 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలగే 5, వాండర్సే 2, మహీషా తీక్షణ 2, అశిత ఫెర్నాండో 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో శ్రీలంక 2-0 తేడాతో వన్డే సిరీస్ దక్కించుకుంది.

**దీటుగా మొదలుపెట్టి.. ఢీలా పడి..**

టీమ్‌ఇండియా 240 పరుగుల లక్ష్య ఛేదనను దీటుగానే ప్రారంభించింది. 7 ఓవర్లకే స్కోర్ 50 పరుగులు దాటించింది. రోహిత్ శర్మ ధనాధన్ బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే ఐదో ఓవర్లో శుభ్‌మన్ గిల్ (6 పరుగులు) సిరీస్‌లో వరుసగా మూడోసారి విఫలమయ్యాడు. ఇక ధాటిగా ఆడుతున్న రోహిత్ కూడా 7.1 వద్ద క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తర్వాత మిగతా బ్యాటర్లెవరూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. వరుసగా రిషబ్ పంత్ (6 పరుగులు), విరాట్ కోహ్లీ (20 పరుగులు), అక్షర్ పటేల్ (2 పరుగులు), శ్రేయస్ అయ్యర్ (8 పరుగులు), రియాన్ పరాగ్ (15 పరుగులు) క్యూ కట్టారు. దీంతో భారత్ 100 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. దీంతో అప్పుడే టీమ్‌ఇండియా ఓటమి దాదాపు ఖరారైంది. అయితే చివర్లో వాషింగ్టన్ సుందర్ (30 పరుగులు) పోరాడి ఓటమి అంతరాన్ని తగ్గించాడు. చివర్లో కుల్దీప్ (6 పరుగులు) వెనుదిరగడంతో 138 స్కోర్ వద్ద భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

**శ్రీలంక బ్యాటింగ్..**

ఫస్ట్ బ్యాటింగ్ చేసిన శ్రీలంక 50 ఓవర్లలో 248-7 పరుగులు చేసింది. ఓపెనర్లు పాతుమ్ నిస్సంక (45), అవిష్క ఫెర్నాండో (95), కుశాల్ మెండీస్ (59) రాణించారు. చివర్లో కామిందు మెండీస్ (23★) ఆకట్టుకున్నాడు. ఇక టీమ్‌ఇండియా బౌలర్లలో రియాన్ పరాగ్ 3, కుల్దీప్ యాదవ్, సిరాజ్, అక్షర్ పటేల్, సుందర్ తలో వికెట్ దక్కించుకున్నారు.

**27 ఏళ్ల తర్వాత పరాభావం..**

ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ డ్రా గా ముగియగా, తర్వాత రెండు వన్డేల్లోనూ ఆతిథ్య శ్రీలంక విజయం సాధించింది. దీంతో దాదాపు 27 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియాపై శ్రీలంక వన్డే సిరీస్ నెగ్గింది. ఇక ఇదే పర్యటనలో జరిగిన టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకుంది.



**గౌతమ్ కోచ్ లో తొలి వన్డే సిరీస్**

టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ కాంబోలో ఆడిన తొలి వన్డే సిరీస్‌ను భారత్ కోల్పోయింది. శ్రీలంకతో జరిగిన ఈ వన్డే సిరీస్‌లో 0-2తో భారత్ ఓడిపోయింది. బ్యాటర్ల వైఫల్యంతో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ భారత్ గెలవలేకపోయింది.

# భారత్ కు నిరాశ..

- రెజ్లర్ వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు
- 100 గ్రాములు అదనంగా ఉన్నట్లు సమాచారం..
- బరువు తగ్గేందుకు అష్టకష్టాలు..



**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత్‌కు భారీ షాక్ తగిలింది. నాలుగో పతకం ఖాయం చేసిన వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు బరువు కొలవగా.. 50 కేజీల కంటే సుమారు 100 గ్రాములు ఎక్కువగా ఉన్నట్లు తేలినట్లు సమాచారం. దీంతో ఆమెపై అనర్హత వేటు వేస్తూ.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నాయి. వాస్తవానికి మహిళల ఫ్రీస్టైల్ 50 కేజీల ఫైనల్ బుధవారం రాత్రి జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఆమె బరువును చూసిన నిర్వాహకులు 100 గ్రాములు అదనంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.

**ఫైనల్ చేరిన తొలి మహిళా రెజ్లర్..**

వినేష్ ఫొగాట్ తన కెరీర్‌లో మూడో ఒలింపిక్‌లో పాల్గొంది. ఈ ఈవెంట్‌లో ఫైనల్ చేరిన తొలి మహిళా రెజ్లరగా నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో గాయం కారణంగా ఆమె పోటీ నుంచి నిష్క్రమించింది. ఇక 2020 టోక్యో ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయింది. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లో వరుస విజయాలతో ఫైనల్ చేరింది. రౌండ్-16లో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌కు చెందిన యుయిని 3-2తో వినేష్ ఫొగాట్ చిత్తు చేసింది. దీంతో క్వార్టర్స్‌కు చేరుకుంది. క్వార్టర్స్‌లోనూ ఉక్రెయిన్‌కు చెందిన ఒక్సానా లివాచ్‌ను 7-5తో ఓడించింది. సెమీఫైనల్ అయితే ఏకంగా 5-0 తేడాతో క్యూబాకు చెందిన రెజ్లర్ యుస్నీలిస్ గుజ్మాన్‌ను చిత్తు చేసింది. దీంతో ఈసారి ఆమె స్వర్ణ పతకం సాధిస్తుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా కొన్ని గ్రాముల బరువు ఎక్కువగా ఉండటంతో నిష్క్రమించింది.

**నీరు కూడా తీసుకోకుండా..**

వినేష్ ఫొగాట్ మంగళవారం బౌట్ సమయంలో తన బరువు నియంత్రణలోనే ఉంచుకుంది. నిబంధనల ప్రకారం.. ఆటగాళ్లు రెండ్రోజులు బరువును నిర్ణీత కేటగిరి పరిధిలోనే ఉంచుకోవాల్సి ఉంటుంది. అయితే, మంగళవారం రాత్రికి వినేష్ 2 కిలోల అదనపు బరువు ఉన్నట్లు సమాచారం. దీంతో జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ లాంటివి చేసింది. ఎలాంటి ఆహారం తీసుకోలేదని తెలుస్తోంది. కనీసం నీరు కూడా తాగలేదంట. అంతేకాదు.. బరువును తగ్గించుకునేందుకు రాత్రంతా మేల్కొనే ఉన్నట్లు సమాచారం. దీంతో అస్వస్థతకు గురైంది.

**జుత్తు కత్తిరించుకున్న ఫొగాట్..**

బరువును తగ్గించుకునేందుకు వినేష్ ఫొగాట్ తన జుత్తును కూడా కత్తిరించుకుంది. వినేష్ ఫొగాట్ శరీరం నుంచి కొంతమేర రక్తాన్ని కూడా తీసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అన్ని రకాలుగా ప్రయత్నించినా.. ఫైనల్స్‌కు ముందు వెయిట్ పరీక్షల సమయానికి వినేష్ 100 గ్రాముల అదనంగా బరువు ఉంది. దీంతో ఆమెపై అనర్హత వేటు వేశారు. దీంతో ఆమెకు సిల్వర్ పతకం కూడా దక్కే అవకాశం లేదు.




# గోల్డెన్ ఆఫర్..

- నీరజ్ చోప్రాకు సపోర్ట్ గా సెలబ్రెటీలు
- లక్షల రూపాయల ఆఫర్ ప్రకటన..

జనపదం, స్పోర్ట్స్: భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా మంగళవారం ఒక్క త్రోతో సంచలనం సృష్టించాడు. నీరజ్ గోల్డ్ మెడల్ సాధిస్తాడంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరందుకుంది. ఇదే సమయంలో క్రికెటర్లు సైతం నీరజ్ చోప్రాకు మద్ధతుగా నిలుస్తున్నారు. నీరజ్‌ను ఎంకరేజ్ చేసేందుకు.. అతని అభిమానులకు బంపర్ ఆఫర్స్ ఇస్తున్నారు. తాజాగా టీమిండియా స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్, ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్.. అదిరిపోయే ఆఫర్స్ ప్రకటించారు.

**భారత్-పాక్ మధ్య పోటీ..**

ఫైనల్ మ్యాచ్‌లో భారత్ తరఫున నీరజ్ చోప్రా అర్హత సాధించగా, పాకిస్థాన్ తరఫున అర్షద్ నదీమ్ అర్హత సాధించాడు. దీంతో ఫైనల్స్‌పై ఉత్కంఠ మరింత పెరిగింది. క్వాలిఫైయింగ్‌లో.. ఆటగాళ్లందరూ నీరజ్ చోప్రా త్రోకు చేరువయ్యేందుకు తమ శాయశక్తులా ప్రయత్నించారు. కానీ ఎవరూ నీరజ్‌ను బీట్ చేయలేకపోయారు.

**ఆఫర్స్..**

నీరజ్ చోప్రాకు మద్ధతుగా అభిమానుల కోసం రిషబ్ పంత్ లక్షల రూపాయల ఆఫర్ ప్రకటించాడు. 'నీరజ్ చోప్రా రేపు స్వర్ణం గెలిస్తే... ట్వీట్‌ను ఎక్కువగా లైక్ చేసిన, కామెంట్స్ చేసిన వారిలో అదృష్టవంతుడొకరికి రూ. 100089 ఇస్తాను. అలాగే, మిగిలిన టాప్ 10 మెంబర్స్‌కు విమాన టిక్కెట్లు ఇస్తాను. నీరజ్ భాయ్‌కి భారతదేశం తరఫునే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మద్ధతు ఉంటుంది.' అని రిషబ్ పంత్ పేర్కొన్నాడు. ఇక కావ్యా మారన్ సైతం ఇలాంటి ఆఫర్‌నే ప్రకటించింది. ఫైనల్స్‌లో నీరజ్ చోప్రా గోల్డ్ మెడల్ గెలిస్తే.. తన పోస్టుకు లైక్స్, కామెంట్స్ పెట్టిన వారిలో ఎవరో ఒకరికి రూ. 1,00,099 ఇస్తానని ప్రకటించింది.